# కొత్త చిగుళ్లు

నాకు అవధానిగారంటే సద్భావం ఏర్పడడమేకాక నా మనసులో ఆయనకొక ఉన్నత స్థానం కూడా ఏర్పడింది. అలాగని ఆయన నాకు ప్రత్యేకంగా చేసిన ఉపకారాలంటూ ఏమీ లేవు. ఎదుటివాళ్ల గొప్పతన్నాన్ని వాళ్ళు తనకు చేసిన సహాయాన్ని బట్టిగాక.. నిజంగా వారి ఉన్నతాశయాలను బట్టి అంచనా వేసే అతి కొద్ది మందిలోనూ నేనూ ఉన్నాను.

అవధానిగారింట్లో అన్ని తెగలవారు ఉన్నారు. ఆయన తలిదండ్రులు పూర్వాచార పరాయణులు. వాళ్లు ప్రతిరోజూ పూజలు చేస్తారు. పూజ పూర్తయ్యేవరకూ మడిలో ఉంటారు. కంచాలలో భోజనం చేయరు. వంట తమకోసం ప్రత్యేకంగా మడిగా తయారుచేసుకుంటారు. వాళ్ల కోరిక మేరకు అన్నీ నిర్విఘ్నంగా జరిగిపోవడానికి అవధానిగారేర్పాట్లు చేశారు.

అవధానిగారూ ఆయన భార్యా కాస్త మధ్యరకంగా ఉంటారు. వీలునుబట్టి వాళ్ల ఆచారముంటుంది. ఎటొచ్చీ అవధానిగారు మాత్రం విధిగా ప్రతి రోజూ సంధ్య వారుస్తారు. ముఖ్యమైన పండుగలన్నీ వారింట్లో శాస్త్రోక్తంగా జరుగుతాయి. అవధానిగారి భార్య చాలా నోములు పడుతూంటుంది.

అవధానికిగారికి నలుగురు పిల్లలు. మొదటి ఇద్దరూ మగ పిల్లలు. తర్వాత ఇద్దరూ ఆడ పిల్లలు. పెద్దవాడు రామశాస్త్రి వాల్తేర్లో రీసెర్చి చేస్తున్నాడు. రెండోవాడు కృష్ణ శర్మ మా ఊళ్లోనే కాలేజీలో బీయస్సీ చదువుతున్నాడు. పెద్దమ్మాయి వరలక్ష్మి కాలేజీలో ఇంటర్మీడీయేట్

చదువుతోంది. రెండో అమ్మాయి అలివేలు మంగతాయారు హైస్కూల్లో టెన్తు క్లాసు చదువుతోంది. ఆడపిల్లలిద్దరూ ఇంటి దగ్గర సంగీతం కూడా నేర్చుకుంటున్నారు. ఇంకా పిల్లలెవరికీ పెళ్లిళ్లు కాలేదు.

అవధానిగారు మా ఊళ్లోనే ఏదో గవర్నమెంటు ఆఫీసులో ఆఫీసరుగా ఉంటున్నారు. ఆయనకో పదిహేనెకరాల భూమి కూడా ఉంది. మా ఊళ్ళో ఆయన స్వంతింట్లో ఉంటున్నారు. మా ఊరంటే నా అభిప్రాయం ప్రస్తుతం ఉద్యోగరీత్యా నేనుంటున్న ఊరని, అవధానిగారింట్లో అద్దెకుంటున్నాను నేను.

అవధానిగారికి లోకానుభవం చాలా ఉంది. ఆయన పరిజ్ఞానం కూడా తక్కువదేమీ కాదు. అందుకే వయసులో నాకూ ఆయనకూ చాలా భేదమున్నప్పటికీ ప్రతి రోజూ సాయంత్రాలు ఆయనతో ఓ గంటయినా సంభాషించనిదే నాకూ తోచేది కాదు. విషయాలను చమత్కరించి చెప్పడంలో ఆయన కాయనే సాటి.

దేశాన్ని బాధిస్తూన్న ఎన్నో సమస్యల గురించి ఆయన నాతో చర్చించేవారు. ఆయన అభిప్రాయాలు చాలా ఉన్నతంగా ఉండేవి. ఒక పర్యాయం లంచాలు తీసుకోవడం గురించి ఆయన నాతో ఇలా అన్నారు.... "దేశానికిదో పెద్ద సమస్యగా తయారయింది. కానీ తప్పు అటు ఇచ్చే ప్రజలోనూ, ఇటు పుచ్చుకునే అధికారుల్లోనూ కూడా ఉంది. దీన్నాపడానికి ప్రభుత్వం జోక్యం చేసుకోనవసరం లేదు. ప్రతీవారికీ చిత్తశుద్ధి ఉండాలి. నేను లంచమివ్వనని ప్రతి పౌరుడూ నిర్ణయించుకొని, నేను లంచం పట్టనని ప్రతీ అధికారి గట్టిగా అనుకుని ఉన్న పక్షంలో ఈ దురాచారం కొనసాగి ఉండేది కాదు. కానీ ఎవరిమటుక్కు వారే 'జరిగేవన్నీ ఎలాగూ జరిగిపోతున్నాయి...నా ఒక్కడి వల్ల దేశం మారుతుందా' అనుకునే మనస్తత్వం కలిగి ఉండడంతో నేరం మరింత విచ్చలవిడిగా జరిగిపోతోంది. రామాయణంలో 'ఉడతా భక్తి' కథ మనకు చెప్పే నీతి ఏమిటి? కార్యమెంత బృహత్తరమైనదైనా నీ వల్ల నవుతుందా అవదా అని సందేహించకుండా నీ వంతు పని నువ్వు చెయ్యాలని. లంచాలు పడితే నేనీపాటికి లక్షలు గడించి ఉండేవాడిని. కానీ ఏదో ఉడతాభక్తిగా నా వంతు నేను నీతిగా ఉండడానికి ప్రయత్నిస్తున్నాను".

నిజమేననిపించింది నాకు. మన నైతిక ప్రవర్తనకీ 'ఉడతా భక్తి' కథ బాగా ఉపకరిస్తుంది. కానీ ఎంతమంది ఈ నీతిని గ్రహించడానికి ప్రయత్నిస్తున్నారు?

నా మిత్రుడికో పది నెలల పాప వుంది. ఆ పాపకు అమూల్ స్ప్రే పాలు పడతారు. ఇటీవల ఈ బ్రాండు పాలడబ్బా చాలా తరచుగా బ్లాక్ మార్కెట్లోకి వెళ్లిపోతోంది,. అయినా నా మిత్రుడెలాగో అలా ప్రయత్నించి అయిదారు రూపాయలు ఎక్కువైనాసరే బ్లాక్ మార్కెట్లో అది కొని వాడతాడు. "ఏం చేస్తాను?మా పాపకు మరేమీ పడవు. దాని ఆరోగ్యం కంటే ఇంకేదీ ముఖ్యం కాదు... నాకు మాత్రం డబ్బెక్కువిచ్చి బ్లాకులో కొనడం సరదా కాదుగదా.." అంటాడతను.

నిజం కాదని నేననను. కానీ అతను నిజంగానే బ్లాకులో పాలడబ్బా కొనడంలోని అవినీతిని గురించి సీరియస్‌గా ఆలోచించేడా అన్నది నా అనుమానం. దొరుకుతోందికదా

అని గుడ్డిగా వెళ్ళి కొనేస్తాడని నా అనుమానం.

అవసరంవల్లనైతేనేం, అలక్ష్యంవల్ల నైతేనేం...ప్రజలే అవినీతిని ప్రోత్సహిస్తున్నారు. ఆ విధంగా తాము దేశానికెంత ద్రోహం చేస్తున్నదీ వాళ్లర్థం చేసుకోవడం లేదు. తమకు తాత్కాలికంగా ప్రయోజనం సిద్ధించినా.. చివరకు నష్టపోయేది తామేనని వారు గ్రహించడం లేదు. ఈ అవినీతి ఇప్పటికే మహాపర్వతంలా పెరిగిపోయిందనీ దాన్ని నివారించడం తమ కెలాగూ సాధ్యపడదు కాబట్టి 'నలుగురితోపాటు నారాయణ' అన్న విధంగా ప్రవర్తించే వారీ ఉడతాభక్తి కథ చెప్పే జీవిత సత్యాన్ని గురించి మరోసారి ఆలోచించాలి. మహాసముద్రమైనా కొన్ని నీటి బొట్ల కలయిక మాత్రమేనని తెలుసుకోవాలి.

ఇదే విధంగా అవధానిగారు వరకట్న దురాచారం గురించి కూడా నా దగ్గర ప్రస్తావించారు. ఆడపిల్లలను కన్న తలిదండ్రులు కూడా కొడుకులకు కట్నం దండిగా వసూలు చేయాలని చూడడాన్నాయన నిరసించారు. కొడుకులిద్దరకూ ఆయన కట్నాలు తీసుకోకుండానే పెళ్లి చేయదలిచాడట. ఆడపిల్లలక్కూడా కట్నమివ్వరాదనే ఆయన ఆశయం. కానీ దాని గురించే మూర్ఖంగా పట్టుపట్టి వాళ్లను ఆజన్మాంతం కన్యలుగా ఉంచేసే అభిప్రాయం మాత్రం లేదు. అవసరమైతే వాళ్ళ పెళ్ళిళ్ళకు కట్నంగా ఇవ్వడానికి తన దగ్గర డబ్బున్నదనీ - ఆ డబ్బును మరో ఆడ పిల్ల తండ్రి దగ్గర్నుంచి రాబట్టవలసిన అవసరం లేదనీ ఆయన కచ్చితంగా చెప్పాడు.

ఇది నాకు చాలా నచ్చింది. అవధానిగారి ఉన్నతాశయం ఇక్కడే బయటపడుతుంది. కొడుకుల పెళ్లిళ్లు కట్నాలతో ముడిపడి లేవు. కానీ ఆయన కోరితే వాళ్లకు చక్కని కట్నం లభించగలదు. అయినా ఆయన తీసుకోదల్చుకోలేదు. వరకట్న సమస్య పరిష్కారానికి ఉడతాభక్తిగా ఆయన చేయగలిగినదిదే! కూతుళ్ల పెళ్లికి కట్న మివ్వడం ఆయన అభిమతం కాదుకానీ అదాయన చేతిలో లేదు. తప్పనిసరయితే కట్న మివ్వడానికి ఆయన సిద్ధంగానే ఉన్నాడు. కానీ అందు గురించి మరో ఆడపిల్ల తండ్రి రక్తాన్నాయన రుచి చూడదల్చుకోలేదు.

ఇదిలాగుంటే ఆయన మీద నాకు గౌరవాన్నిపెంచినది.. వర్ణ వ్యవస్థ పట్ల ఆయనకున్న అభిప్రాయాలు. ఆయన సద్బ్రాహ్మణుడు. సదాచార పరాయణుల ఇంట పుట్టినవాడు. కానీ మనుషులంతా ఒక్కటేననీ.. మానవులందరికీ కుల మొక్కటేనని దృఢంగా నమ్మిన అతి కొద్దిమందిలోనూ అవధానిగారొకరు.

ఆఫీసులో అవధానిగారిపై ఆఫీసరు హరిజనుడు. 'తన ఉన్నతాశయాల నాచరణల్లో చూపించడానికన్నట్లు ఆయన పనికట్టుకుని వాళ్లింటికి తరచుగా వెళ్లి తన పై ఆఫీసరు భార్య స్వయంగా తయారుచేసి ఇచ్చిన కాఫీ తాగుతూంటాడు. టిఫిన్సు తింటూంటాడు. వాళ్ళను తన ఇంటికీ అనేక పర్యాయాలు విందు కాహ్వానించాడు.

అతిథుల కోసం అవధానిగారింట్లో ప్రత్యేకంగా ఒక గది ఉంది. డైనింగ్ టేబుల్ ఉన్నది ఆ గదిలోనే. సాధారణంగా అవధానిగారింట్లో భోజనాలు పీటల మీద కూర్చుని చేస్తారు. అతిథులు వచ్చినప్పుడు మాత్రం డైనింగ్ టేబుల్ మీద అతిథుల గదిలో భోంచేస్తారు.

అతిథులతో పాటు అవధానిగారు, మగపిల్లలు మాత్రమే భోజనాలు చేస్తారు. వారింట్లో - ఆయన తలిదండ్రుల ఆచారం కొనసాగడానికి వీలుగా ఈ ఏర్పాటు చేయబడింది. అతిథుల్లో కులమత భేదం లేకుండా అందరికీ ఆ గదిలోనే భోజనం!

అవధానిగారికి తరచుగా తనపై ఆఫీసరుగారింటికి వెళ్లవలసిన అవసరం లేదు. ఆయనను తనింటికి పిలవ్వలసిన అవసరమూ లేదు. ఆఫీసులో సమర్థుడన్నపేరు అవధానిగారికి ఉంది. నిప్పులాంటివాడన్న భయమూ ఉంది. డబ్బున్నవాడన్న గౌరవమూ ఉంది. ఈ మూడు కారణాలవల్ల ప్రమోషన్ గురించి కానీ ఇతర చిన్న లాభాల గురించి కానీ అవధాని గారు తన పై ఆఫీసరింటి చుట్టూ తిరగ నవసరం లేదు. అటువంటి పక్కదారులు తొక్కి పైకి పోవాలనుకునే మనస్తత్వం అవధానిగారికి లేదు. అయినా ఆయన తన పై ఆఫీసరుతో పూసుకుని తిరుగుతున్నాడంటే అందుక్కారణం ఆయన హరిజనుడు కావడమే!

సమాజం త్వరితగతిని మార్పు చెందడానికి ఈ విధమైన మైత్రి అవసరమని ఆయన తరచుగా నాతో అంటూండేవాడు. అంతేకాదు.. ఆయనలో అహంభావం కూడా ఉన్నట్లు లేదు...'నేను బ్రాహ్మణుడిని. నా పై ఆఫీసరు హరిజనుడు.. ఇందులో ఎవరు గొప్పంటావ్?' అని ఆయన నన్నడిగినప్పుడు నేను నిజంగానే ఆశ్చర్యపోయాను.

అవును మరి! ఇలా ఆలోచించి చూడగలిగితే గొప్పతనాన్ని కులాన్ని బట్టి అంచనా వేసే మూర్ఖులకు కనువిప్పవుతుంది.

ఈ కారణాల వల్ల అవధానిగారిపట్ల నానాటికీ నాకు పూజ్యభావం పెరిగి పోతోంది. ఒక విధంగా చెప్పాలంటే నేనాయన్నారాధిస్తున్నాను.

ఇలా ఉండగా నా కళ్ళ ముందే అవధానిగారి ఆశయాలకు పరీక్ష వచ్చింది. అవధానిగారి పెద్దబ్బాయి రామశాస్త్రి వాల్తేరు నుంచి ఆయన కుత్తరం రాశాడు. యూనివర్శిటీలో యమ్మెస్సీ చదువుతున్న భానుమతి అనే పేరు గల పిల్లనతను ప్రేమించేశాట్ట. ఆమెను వివాహం చేసుకోవాలనే నిర్ణయానిక్కూడా వచ్చాడట. పెద్దలీ వివాహానికంగీకరించని పక్షంలో అతను శాశ్వతంగా తలిదండ్రులతో తెగతెంపులు చేసుకోవలసి ఉంటుందన్న విషయాన్నీ తను సూచనప్రాయంగా తెలియజేశాడట. ఇంతకీ ఇబ్బంది ఎక్కడ వచ్చిందంటే.. భానుమతి కమ్మవారి ఆడపడచు.

మానవులందరిదీ ఒక్కటే కులమని నమ్మే అవధానిగారినీ వార్త సంతోషపరిచినట్లు కనబడలేదు. అయితే అందుక్కారణాలు మాత్రం మనమనుకునేవి కావు.

అవధానిగారికి లోకానుభవం ఉంది. అంటరాని తనాన్నాయన నిరసిస్తున్నాడు. మైత్రికి కులం అడ్డురాకూడదన్నది ఆయన సిద్ధాంతం. అయితే మైత్రి వేరు, వివాహం వేరు అన్న విషయం ఆయనకు లోకానుభవం చెబుతోంది.

భారతదేశంలో వర్ణవ్యవస్థ బాగా పాతుకుపోయి ఉంది. కులతత్వం ప్రతివారి నరనరాల్లోనూ జీర్ణించుకుపోయింది. ప్రతి కులం వారికీ కొన్ని ప్రత్యేకమైన ఆచారాలూ. అలవాట్లూ ఉన్నాయి. ఒక కులం వారి అలవాట్లకూ, మరో కులంవారి అలవాట్లకూ పొంతన

కుదరదు. అందుకే పూర్వీకులు సవర్ణ వివాహాలను ప్రతిపాదించారు. అప్పుడే దంపతుల మధ్య సామరస్యం కుదురుతుంది.

వివాహానికి ముందు యువతీయువకుల్లో ఒకరిపట్ల ఒకరికి శారీరక ఆకర్షణ ఉంటుంది. ఆ ఆకర్షణ చాలా బలమైనది కావడంతో అది దురావేశాన్ని కలిగిస్తుంది. దురావేశం దూరాలోచనలేకుండా చేస్తుంది. ఫలితంగా యువతీయువకులు త్వరపడి నిర్ణయం తీసుకుని కేవలం శారీరకంగా దగ్గర కావలానుకునే కోరికకు ప్రేమ అని పేరుపెట్టి వివాహా నికి సిద్ధపడతారు. వివాహం కాగానే వారి కోరిక సిద్ధిస్తుంది. కోరిక సిద్ధించగానే ఆవేశం చల్లారుతుంది. ఆకర్షణ తగ్గుతుంది. అహం తలెత్తుతుంది. ఇద్దరికీ తమ ఆచారాల పట్ల, అలవాట్ల పట్ల గౌరవభావం ఉంటుంది. సామరస్యం కుదరదు. ఎవ్వరూ దిగిరారు. యువకుడిలో పురుషత్వపు అహంకారం తలెత్తుతుంది. చదువుకున్న స్త్రీ ఆ అహంకారాన్నామోదించదు. భేదాభిప్రాయాలు మొదలవుతాయి. ఇద్దరికీ ఏదో అసంతృప్తి - ఏదో తెలియని బాధ. ఒక్కో పర్యాయం ఇది విడాకుల వరకూ దారి తీస్తుంది.

వియ్యానికైనా నెయ్యానికైనా సమ ఉజ్జీలుండాలని పెద్దలందుకే అన్నారు. కులాలొక్కటే కాదు.. ఆస్తిపరంగానూ, అంతస్తులలోనూ కూడా ఇద్దరూ సమంగా ఉండాలి. లేకపోతే సామరస్యం కుదరదు. సామరస్యం కుదిరితే దంపతుల మధ్య క్రమంగా అవగాహన పెరుగుతుంది. అవగాహన ప్రేమను సృష్టిస్తుంది. ఆ ప్రేమ క్రమంగా వృద్ధి చెంది..వాళ్ల జీవితంలో ఆనందాన్ని నింపుతుంది.

పెళ్ళికి ముందు పుట్టిన ప్రేమ పెళ్లితో అంతమవుతుంది. పెళ్లి తర్వాత ప్రారంభమైన ప్రేమ జీవిత కాలమూ ఉంటుంది. ఈ కారణంగానే ప్రేమ వివాహాలన్నీ భగ్నమై పోతున్నాయి.పెద్దలు చేసిన పెళ్లిళ్లు కలకాలం నిలుస్తున్నాయి.

అవధానిగారు నాకు వివరించిచెప్పారీ విషయాలన్నీ. నిజమేననిపించింది. గుడ్డిగా ఆశయాలూ, ఆదర్శాలూ అంటూ కూర్చోకుండా ఈ విధంగా ప్రతీ ఒక్కరూ ఆలోచించగలిగితే మూఢ నమ్మకాలను త్వరగా నిర్మూలించవచ్చునేమోనని తోచింది నాకు. ఇదంతా విని చాలా మంది అవధానిగారిని అవకాశవాదిగా భావించవచ్చు. కానీ ఆయన చెప్పిన మాటల్లో నిజం లేదని ఎవ్వరూ అనలేరు. ఆవేశం లేదని ఎవ్వరూ అనలేరు. ఆవేశం వివాహానికి దారి తీయకూడదు. వివాహం నూరేళ్ళు కొనసాగాలంటే అనేక ఇతర విషయాలనుగమనించవలసి ఉంటుంది. ఉదాహరణకు దంపతుల్లో ఒకరావేశపరులయితే రెండోవారు నెమ్మదితనం కలిగి ఉండడమెంతైనా అవసరం. ఇవన్నీ పెద్దల్లు చూసుకోగలిగినట్లు పిల్లలు చూసుకోలేరు.

అవధానిగారి బాధ నాకు అర్థమైంది. కొడుకు మరో కులం పిల్లను పెళ్లి చేసుకుంటున్నాడని ఆయన బాధ పడడంలేదు. కేవలం కొడుకు భవిష్యత్తు గురించి ఆయన బాధపడుతున్నాడు. ఈ సందర్భంలో విషయాన్ని స్వయంగా తెలుసుకోడానికి ఆయన వాల్తేరు వెళ్లి వచ్చాడు.

వాల్తేరు నించి తిరిగి వచ్చేక - అవధానిగారు మరీ ఉత్సాహంగా లేకపోయినా - ఆయన ధోరణి మాత్రం మారింది.

భానుమతి చూడ్డానికి చిదిమి దీపం పెట్టుకోవచ్చుననిపించేలా ఉంటుందిట. చాలా తెలివైనది. పెద్దల పట్ల వినయం, విధేయత చూపడం తన బాధ్యతల్లో ఒకటిగా భావిస్తుంది. మీదు మిక్కిలి ఆమె శాకాహారి. ఆమె ఉచ్ఛారణ స్పష్టంగా ఉంటుంది. ఆమెను గురించి ఇతర విషయాలేమీ తెలియకుండా ఉంటే రామశాస్త్రికి తగిన వధువు అని తక్షణం తోస్తుంది. ఏ కారణంగా ఆమెను ఇంటి కోడలుగా నిరాకరించాలో అవధానిగారికి అర్థం కావడం లేదు.

"మీ దూరాలోచన అంతా అతనికి చెప్పారా?" అన్నాను.

"చెప్పేనోయ్..కానీ వాడు వినేలా లేడు. వాడీ విషయంలో తుది నిర్ణయానికి వచ్చేశాడు. అక్కడికి వెళ్లి పరిస్థితులు చూసేక వాడి నిర్ణయం తప్పని నేనూ అనలేకపోతున్నాను." అన్నాడాయన.

ఆ తర్వాత అయిదారు రోజులు రాబోయే కోడలి గురించి సంతృప్తిని ప్రకటిస్తూ అవధానిగారు నాతో ముచ్చటించాడు. నా మటుక్కు నాకా సంభాషణ అంత సహజంగా తోచలేదు. తన మనసును సరిపెట్టుకునేందుకు చేస్తున్న ప్రయత్నంగా ఆయన నాతో మాట్లాడుతున్నాడని నాకు అనిపించింది. అది నాకంత అసహజమనిపించలేదు.

ఒక్కసారిగా ఇలాంటి మార్పు తన ఇంట్లో రావడం ఆయనకు కష్టంగానే తోచి ఉంటుంది. ఇటువంటి పెళ్లి వారింట జరగడం ఇదే మొదలు. ఆడపిల్లల పెళ్లిళ్లు చేసేదెలా అని కూడా ఆయన భయపడుతున్నాడు. ఆ విషయంలో బాధ్యత తనదనీ, ఏమీ భయపడనవసరం లేదనీ రామశాస్త్రి ఆయనకు హామీనిచ్చాడు.

అవధానిగారి అంగీకారం లభించి వివాహానికి ముహూర్తం నిశ్చయించబడ్డాక ఆయనింట్లో పెద్ద గొడవ జరిగింది. అవధానిగారి తల్లిదండ్రులు కొంపలు మునిగిపోయినట్లుగా శోకాలు పెట్టారు. అవధానిగారు తన వాక్చాతుర్యంతో, పట్టుదలతో, ఒక రోజులో వారికి ఎదురు నిలిచి సఫలీకృతుడు కాగలిగాడు. ఈ విజయాన్నాయన కొత్త రకంగా సెలబ్రేట్ చేసుకున్నాడు.

అవధానిగారి దొడ్లో ఒక చిన్న సైజు చెట్టు ఉంది. అది ఏ జాతిదో ఎవ్వరికీ తెలియదు. ఎలా పుట్టిందో, ఎలా పెరిగిందో మొత్తం మీద అది దొడ్లో మొక్కగా వెలిసి చెట్టుగా మారింది. తలిదండ్రుల్ని - మనుమడి వర్ణాంతర వివాహాని కంగీకరింపజేసిన మరుసటి రోజున ఆయన దొడ్లో ఆ చెట్టును కొట్టించేస్తున్నాడు. అలికిడికి నేనూ దొడ్లోకి వెళ్ళి విషయం గమనించి..."ఏమిటి విశేషం?" అనడిగాను.

"ఇదేం చెట్టో నాకు తెలియదు. కానీ నా ఇంట పాతుకుపోయిన వర్ణ వ్యవస్థకు చిహ్నంగా దీన్ని భావించి...ఈనాడు దీన్ని కూకటి వేళ్ళతో పెకలించేయదల్చుకున్నాను" అన్నాడాయన.

నాకు చాలా నచ్చేయాయన మాటలు. మనసులోనే ఆయన్నభినందించాను.

ఒక పర్యాయం ఆయన క్యాంపుకి వెళ్లిన ఊరికి నేను కూడా ఏదో పనిమీద వెళ్లడం సంభవించింది. ఇద్దరం ఆ ఊరి బజార్లో సుమారు పన్నెండు గంటల ప్రాంతాల్లో

ఒకరికొకరు తటస్థపడ్డాము. నేనాయన్ను చూడలేదు. ఆయనే నన్ను చూసి పలకరించాడు.

"ఏమిటిలా వచ్చారు?" అన్నాను.

ఆయన చెప్పాడు. ప్రస్తుతం ఆయన భోజనానికని బయల్దేరాడు. నేనూ అందుకే బయల్దేరాను. "అన్నపూర్ణా హోటల్లో, భోజనం బాగుంటుందట.. వస్తారా?" అన్నాను. ఆయన తనదారి నాతోపాటే మళ్ళించాడు.

ఇద్దరం హోటల్‌కు వెళ్ళాం. చాలా రష్ గా ఉందక్కడ. ఎక్కడా సీట్లు కాళీగా లేవు. ఒకే ఒక్క చోట మాత్రం రెండు సీట్లు కాళీగా ఉన్నాయి. నేనాయనకటుగా చూపించాను. ఆయన కూడా అటు పరీక్షగా చూసి నాలుగడుగులు ముందుకువేసినవాడు మళ్లీ వెనుకడుగు వేసి... "పద..కాసేపు బయట వెయిట్ చేద్దాం" అన్నాడు.

"ఎందుకండీ.. కాళీ కుర్చీలున్నాయిగదా" అన్నాను.

"చెబుతాను..ముందు బయటకురా?" అన్నాడాయన.

మాట్లాడకుండా అయన్ననుసరించాను.

"అక్కడ కుర్చీలు కాళీగా ఉన్నా నేనెందుకు కూర్చోలేదో చెప్పనా?" అన్నాడాయన. నేను మాట్లాడలేదు. ఆయనే మళ్లీ అన్నాడు. "ఆ పక్క సీట్లో మరొకడూ మరొకడూ ఉంటే ఫరవాలేక పోయేది. నాతోపాటు క్యాంపు కొచ్చిన మా ఆఫీసు ప్యూన్ అక్కడ కూర్చుని భోజనం చేస్తున్నాడు. చూస్తూ, చూస్తూ వాడి పక్కన ఎలా కూర్చునేది?"

ఉలిక్కిపడి ఆయన ముఖంలోకి చూశాను. అది నిశ్చలంగా నిర్మలంగా ఉంది. తప్పు మాట్లాడేనన్న భావం ఎక్కడా ఆయన కళ్లలో కనబడ్డంలేదు. అత్యంత సహజమైన విషయం చెప్పినట్లుగా చూస్తున్నాడాయన.

ఈ సంఘటన నాకో కొత్త నిజాన్ని తెలియజేసింది. అంటరానితనాన్ని నివారించడానికి మనమెన్నో ప్రయత్నాలు చేస్తున్నాం. అంటరానివారుగా భావించబడే వారందరికీ సమానావకాశాలుకల్పించాలని చూస్తున్నాం కానీ అంటరానితనం హరిజనులను ఆదరించడంతో నిర్మూలించబడినట్లేనా?

కలెక్టరింట్లో కలెక్టర్‌గారి పక్కన కూర్చుని భోజనం చేసే అవకాశం ఆయన ప్యూన్‌కి వస్తుందా? రాని పక్షంలో దాన్ని అసహజమని భావించగల వారెందరున్నారు? ఆ ప్యూను అంటరానివాడు కానట్లయితే.. అతన్నిప్పుడు ఏమని పిలవాలి?

జవాబు నాకు దొరకలేదు. కానీ నేను మళ్లీ ఊరు తిరిగి వెళ్ళేక అవధానిగారి దొడ్లో అవధానిగారు కూకటి వ్రేళ్లతో పెకలించే ననుకున్న వృక్షం స్థానంలో నాకు మరో చిన్న మొక్క కనిపించింది. అదేం మొక్కో నాకు తెలిలేదు కానీ దాని నిండా ఉన్న కొత్త చిగుళ్లను బట్టి...ఈ మొక్క కూడా పెరిగి పెద్దదై మహావృక్షం కాగలదని నాకు తోచింది. ★

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక -- 21-4-78)